క్లుప్తంగా

సర్పంచ్ కుటుంబంపై దాడి

రాజాం: మండలంలోని వీఆర్ అగ్రహారం గ్రామ సర్పంచ్ డబ్బాడ ఆదిలక్ష్మి కుటుంబంపై అదే కుటుంబానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి, రాజాం ఎస్ఐ రామకృష్ణ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సర్పంచ్ కుటుంబంపై అదే గ్రామానికి చెందిన డబ్బాడ సత్యంనాయుడు, అతడి కొడుకులు చంద్రినాయుడు, దాలినాయుడు(గణేష్)లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్పంచ్ భర్త అప్పలనాయుడుతో పాటు ఆయన కోడలు సుశీల, మరో మహిళ డబ్బాడ సత్తెమ్మకు గాయాలయ్యాయి. వీరు ఇంట్లో ఉంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకుని, చుట్టుపక్కల ప్రజలు అక్కడకు చేరుకుని దాడిని అడ్డుకున్నారు. గాయాలపాలైన అప్పలనాయుడుతో పాటు సుశీల, తదితరులను 108 వాహనంలో రాజాం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాజాం ఎస్ఐ రామకృష్ణ ఆస్పత్రికి చేరుకుని, గాయాలపాలైన వారి వద్ద నుంచి వివరాలు సేకరించారు. సర్పంచ్ ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. డబ్బాడ అప్పలనాయుడు, సత్యంనాయుడులు అన్నదమ్ములేనని, భూ వివాదాల కారణంగానే ఈ ఘటన జరిగిందని, కల్లాల పంపకాల విషయంలో వివాదం తలెత్తినట్లు స్థానికులు చెబుతున్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం


శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయంలో పలువురు భక్తులు రుద్రాభిషేకాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మూడు నదులు కలిసే చోట(త్రివేణి సంగమం) వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు.

రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్


ఖండ్యాంలో మోటారు నీటిని పంట పొలాలకు తరలిస్తున్న దృశ్యం

రేగిడి: రైతులకు ప్రభుత్వం 9 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సదుపాయం కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మండలంలోని ఖండ్యాం, కొమిర, వెంకటాపురం, రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లో అన్నదాతలు కరెంట్ మోటార్ల ద్వారా నీటిని పొలాలకు తరలించి, చక్కగా ఉభాలు వేసుకుంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో మోటారు నీరు ద్వారా వ్యవసాయ పనులు చేసుకోగలుగుతున్నామని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని చెబుతున్నారు.

ఆర్‌బీకేలకు చేరుకున్న ఎరువులు


చాటాయివలస ఆర్‌బీకేకు చేరుకున్న ఎరువులు

రేగిడి: మండలంలోని అన్ని గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు యూరియా, డీఏపీ ఎరువులు చేరాయి. ఎరువులు కావాల్సిన రైతులు తమకు దగ్గరలోని ఆర్‌బీకేలకు వెళ్లి, తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం సకాలంలో సరఫరా చేస్తోందని, ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

రాజాం: మండల వ్యాప్తంగా ఫీవర్ సర్వే చాలా చురుగ్గా కొనసాగుతోంది. స్థానిక పట్టణంలోని మెంటిపేట ఎస్సీ కాలనీలో వార్డు ఆరోగ్య కార్యదర్శి భారతి, హెల్త్ సూపర్‌వైజర్ సురేష్, ఆశ కార్యకర్తలంతా కలిసి, ఇంటింటికీ వెళ్లి, జ్వరాల బారినపడిన వివరాలను సేకరించారు. అనంతరం బాధితులకు మందులు అందజేశారు. ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు, మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రబ్బరోళ్లు, తాగునీటి బోర్లు, టైర్లు, తాగిపడేసిన కొబ్బరిబోండాల్లో నీరు నిల్వ ఉండడం ద్వారా దోమలు వ్యాప్తి చెంది, జ్వరాలు కలిగిస్తాయన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి
- రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరి
- రాజాం ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి


గడిముడిదాంలో వైద్య శిబిరంలో ఆరోగ్య సలహాలు సూచిస్తున్న వైద్యురాలు(ఫైల్)

రాజాం సిటీ: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అలాగే ప్రతిరోజూ తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకోవాలంటున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ. వ్యాధులను జయించాలంటే ప్రతి ఒక్కరూ రోగనిరోధక శక్తి పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. రోజువారీ ఆహారంలో పౌష్టికాహారం ఉండేలా చూసుకుంటే రోగ నిరోధక శక్తి పెరిగి, రోగాలను నియంత్రించే అవకాశం ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరానికి అవసరమైన మోతాదులో పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చంటున్నారు. తాజా కూరగాయలు, పప్పుధాన్యాలు, పండ్లు, పాలు, మాంసపు కృత్తులు వంటివి తీసుకోవాలని చెబుతున్నారు. సరైన ఆహారపు అలవాట్లు లేకపోవడం, వ్యాయామానికి దూరంగా ఉండడం వల్లే పలువురు వ్యాధుల బారిన పడుతున్నారని రాజాం ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ జీవీ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహారపు అలవాట్లను వివరించారు.

ఆహారపు అలవాట్లు..

- ప్రతిసారి భోజనానికి ముందు, తర్వాత సబ్బుతో చేతులను కడుక్కోవాలి.
- పరిశుభ్రమైన ఆహారం, కాచి వడబోసిన నీరు తీసుకోవాలి.
- ఆహారాన్ని ఒకేసారి కాకుండా ప్రతీ మూడు గంటలకోసారి కొంచెం కొంచెంగా తీసుకోవాలి.
- రోజువారీ ఆహారంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి.
- కూరగాయలు, పండ్లలో ఉండే సూక్ష్మపోషక పదార్థాలు, ఫైబర్ శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.
- పసుపు, నారింజ రంగులో ఉండే పండ్లు కొన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులను నిరోధిస్తాయి.
- తాజాగా ఉండే పచ్చి కూరగాయలు, పండ్లను సలాడ్ల రూపంలో తీసుకోవాలి.

వీటికి దూరంగా ఉండాలి..

నిల్వచేసిన ఆహారం, తీపి పదార్థాలు తీసుకోవద్దు. బయట దొరికే రెడీమేడ్ ఆహారం, ఉప్పుతో కూడిన ఆహారం, కూల్‌డ్రింక్స్, ఫ్రిజ్‌లో ఉంచిన ఆహార పదార్థాలు తీసుకోవద్దు.

నీరు, పాలకు ప్రాధాన్యం..

పరిశుభ్రమైన నీరు తాగాలి. సరిపడ నీరు తాగితే 50 శాతం రుగ్మతలకు దూరంగా ఉండవచ్చు. ఎక్కువగా కాచి వడబోసిన నీటినే తాగాలి. నీటితో పాటు పాలు కూడా ఎంతో అవసరం. రోజుకు 250 మిల్లీలీటర్ల పాలు తాగాలి. కాఫీ, టీ అలవాటు ఉన్నవారు రోజుకు ఒకటి రెండు సార్లు కంటే ఎక్కువ తీసుకోరాదు. కాఫీ కంటే టీ మంచిది.

పప్పు ధాన్యాలు..

ఆహారంలో పల్లీలు, మినుములు, శనగలు, బాదం పప్పు ధాన్యాలు వంటివి ఏదో ఒకటి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతిరోజూ ఏదో ఒక ఆకుకూర వంద గ్రాములు ఉండేలా చూసుకోవాలి. నిమ్మ, జామ, దానిమ్మ, ఉసిరి ఏదో ఒక దానిని తప్పకుండా తీసుకోవాలి. రోజు ఉడికించిన గుడ్డు, వారంలో ఒకసారి చికెన్, మటన్ తీసుకోవాలి.

జలుబు నివారణకు..

జలుబు, దగ్గు, ఆయాసం వంటి సమస్యల నుంచి ఉపశమనం కోసం మిరియాలు, అల్లం వెల్లుల్లి ఉపయోగపడతాయి. వీటిని అవసరం మేరకు వేడినీరు, పాలు, టీలో ఏదో ఒకదానిలో కలుపుకుని తాగితే ఉపశమనంగా ఉంటుంది. కషాయం సూప్ రూపంలో కూడా వీటిని రోజుకు ఒకసారి తీసుకుంటే మంచిది.

'ఎ' విటమిన్‌తో శ్వాసకోస వ్యాధులకు చెక్..

ఆహారంలో ఎ-విటమిన్ ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇది అంధత్వాన్ని నియంత్రించడంతో పాటు పిల్లల్లో వాంతులు, విరేచనాలు, శ్వాసకోశ సంబంధ వ్యాధులను నివారిస్తుంది. కెరోటిన్ ఉన్న మునగ ఆకులు, తోటకూర, మెంతికూర, పాలకూర, క్యారెట్, మంచిగుమ్మడి, మామిడి, బొప్పాయిలను తీసుకుంటే అవి శరీరానికి సరిపడా ఎ-విటమిన్‌ను ఇస్తాయి. డి-విటమిన్ కూడా అవసరం మేరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

రోజువారీ ఆహారం ఇలా..

- ఉదయం రెండు ఇడ్లీలు లేదా 60 గ్రాముల గింజధాన్యాలు లేదా 25 గ్రాముల పప్పులు, 150 మిల్లీలీటర్ల పాలు తీసుకోవాలి.
- ఉదయం 11 గంటల సమయంలో ఒక పండు, నిమ్మరసం లేదా జామకాయ తీసుకోవాలి. ఇవి అందుబాటులో లేకుంటే ఒక కప్పు పాలు అయినా తాగాలి.
- మధ్యాహ్నం భోజనంలో 75 గ్రాముల గింజధాన్యాలు, ఆకు కూరలు, పెరుగు ఉండేలా చూసుకోవాలి.
- సాయంత్రం 5 గంటలకు 50 గ్రాముల గింజ ధాన్యాల చిరుతిండి, ఒక కప్పుపాలు తీసుకోవాలి.
- రాత్రి భోజనంలో రెండు కప్పుల అన్నం లేదా మూడు పుల్కాలు కూరగాయలతో తినాలి. ఒకవేళ కూరగాయలు వద్దనుకుంటే 100 గ్రాముల మాంసాహారం తీసుకోవాలి. 50 గ్రాముల సలాడ్ తీసుకోవాలి.

ఘనంగా వారాల పండగ


తెర్లాం: చీకటిపేటలో మహిళల కోలాటం

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతిఏటా వరినాట్లు వేసేముందు ఈ వారాల పండగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగానే మండలంలోని చీకటిపేట, మోదుగువలస తదితర గ్రామాల్లో జరిగిన ఈ పండగలో ఆయా గ్రామాల దేవతల ఆలయాలకు వెళ్లి, ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని పూజించారు. చీకటిపేటలోని మరిడితల్లి ఆలయం వద్ద పూజలు చేసిన అనంతరం నిర్వహించి కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది.

బాడంగి: మండలంలోని పిన్నవలస, బాడంగి, పూడివలస, గొల్లాది, కోడూరు, డొంకినవలస, లక్ష్మీపురం, తెంటువలస గ్రామాల్లో దేశమ్మతల్లి వారాల పండగ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల గ్రామదేవతలకు పూజలు చేసి, అనంతరం గ్రామ పొలిమేరల్లోని దేశమ్మతల్లి వేపచెట్టు వద్ద ఉన్న పుట్టల దగ్గరకు వెళ్లి, అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఏడాది కూడా పంటలు బాగా పండి, అందరూ సుఖసంతోషాలతో ఉండేలా జీవించాలని కోరుకున్నారు.

జంధ్యాల కవిత్వంలో దయ తొణికిసలాడుతుంది..

- సాహితీవేత్త కిలపర్తి దాలినాయుడు


మాట్లాడుతున్న సాహితీవేత్త దాలినాయుడు

రాజాం సిటీ: పద్యం రాసినా, గేయం రాసినా, బాలగేయం రాసినా జంధ్యాల పాపయ్యశాస్త్రి భావంలో దయ ప్రధానంగా తొణికిసలాడుతుందని, ఆయన రచనల్లో లయ కూడా ఉంటుందని సాలూరుకు చెందిన సాహితీవేత్త కిలపర్తి దాలినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన రాజాం రచయితల వేదిక సమావేశంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన 'కరుణశ్రీ కవితావైభవం' అనే అంశంపై ప్రసంగించారు. కరుణశ్రీ, ఉదయశ్రీ, విజయశ్రీ, తెలుగుబాల, అమర్ ఖయ్యాం వంటి గ్రంథాలను, అనేక ఖండ కావ్యాలను రచించారని తెలిపారు. బుద్ధుని కథను కరుణశ్రీ పేరుతో రాయగా ఆ పుస్తకమే ఆయనను కరుణశ్రీగా మార్చిందని వివరించారు. తిక్కన, జాషువ వంటి ప్రసిద్ధ కవుల కవితా రహస్యాలను తెలుసుకుని, హృద్యమైన, లలితమైన పదాలతో ఎన్నో ఖండ కావ్యాలను రాశారన్నారు. అనంతరం దాలినాయుడును వేదిక సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పొట్నూరు కోటిబాబు, వేదిక నిర్వాహకులు గార రంగనాథం, పెంకి దయానిధినాయుడు, పిల్లా తిరుపతిరావు, ఉరిగి గున్నేశ్వరరావు, శాసపు జయలక్ష్మి, ఒమ్మి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


తెర్లాం: ఉద్దవోలులో కృష్ణ మాస్టారు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


తెర్లాం: పాములవలసలో సింహాచలం కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ మాస్టారు కుటుంబాన్ని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. ఈ నెల 15వ తేదీన మండలంలోని కాలంరాజుపేట పాఠశాలకు మోటార్ సైకిల్‌పై వెళ్తున్న కృష్ణ మాస్టారు రాజాం మండలంలోని కొత్తపేట గ్రామం వద్ద దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆయన మరణ వార్త తెలుసుకున్న ఎంపీ ఉద్దవోలులోని ఆయన స్వగృహానికి వచ్చి ఆయన భార్యా, పిల్లలను కలిసి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణ మాస్టారును అత్యంత కిరాతకంగా హత్య చేయడం చాలా విచారకరమని, నిందితులకు కఠిన శిక్ష పడేలా చట్టం చర్యలు తీసుకుంటుందని ఎంపీ తెలిపారు. మాస్టారు లేనిలోటు తీర్చలేనిదని, ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, తాము అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పాములవలస గ్రామ మాజీ సర్పంచ్ అమరాపు సింహాచలం కుటుంబాన్ని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా సింహాచలం శనివారం మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతి చెందిన విషయం ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని కలిసి, ఓదార్చారు. సింహాచలం మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామన్నారు.

ఆకట్టుకున్న సామూహిక పూజలు


సామూహిక సరస్వతీ దేవి పూజల్లో పాల్గొన్న చిన్నారులు

రాజాం: స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో వాసవి క్లబ్ మనరాజాం-మన సారథి, వనితా క్రాంతి కిట్టు ఆధ్వర్యంలో సామూహిక సరస్వతీ దేవి పూజలు, కోటి కుంకుమార్చన కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. అధిక శ్రావణం సందర్భంగా ఈ పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడు గ్రంధి హరిబాబు, వాసవీ మహిళా మండలి అధ్యక్షులు కొత్తా రత్నకుమారి తెలిపారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదువుతున్న దాదాపు 500 మందికి పైగా విద్యార్థులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు గణేష్ శర్మ, నరసింగరావు శర్మలు తొలుత సరస్వతీ దేవి పూజలు నిర్వహించి, అనంతరం శ్రీచక్ర సహిత కుంకుమార్చనలు చేశారు. కార్యక్రమాల్లో భాగంగా స్థానిక చెరువు గట్టు యువత వేసిన గణపతి, సరస్వతీదేవి, శ్రీదుర్గాదేవి, శ్రీమహాలక్ష్మిల వేషధారణలు ఆకట్టుకున్నాయి. అలాగే చిన్నారుల కోలాటం అలరించింది. ఈ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకుడు నవీన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి వాకచర్ల రాజు, వాసవీ క్లబ్ మన రాజాం-మన సారథి, వనితా క్రాంతి కిట్టు అధ్యక్షుడు గ్రంధి రవి, ఉపాధ్యక్షుడు బత్తుల నగేష్, కోశాధికారి చంటి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసను అరికట్టాలి

రాజాం సిటీ: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మండల సీపీఎం నాయకులు కోరారు. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్న అరాచక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక పట్టణంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అక్కడి రెండు తెగల మధ్య మొదలైన హింసాకాండతో ప్రతిరోజూ మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుకి తెగకు చెందిన గిరిజనుల గృహాలు తగలబెట్టి, విధ్వంసానికి పాల్పడుతున్నా ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమన్నారు. తక్షణమే అల్లర్లకు పాల్పడుతున్న అరాచకశక్తులపై చర్యలు తీసుకుని, మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.సత్యారావు, సురేష్, శ్రీనివాసరావు, తులసి, జ్యోతి, సత్యవతి, రామలక్ష్మి, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి సీహెచ్‌సీకి రోగుల తాకిడి


రోగులతో కిక్కిరిసిన బాడంగి సీహెచ్‌సీ

బాడంగి: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. ఆస్పత్రిలో మొత్తం 30 పడకలు ఉండగా అందులో 25 పడకలు ఇన్‌పేషెంట్లతో నిండిపోయాయి. జ్వరపీడితుల్లో ఎక్కువగా డయేరియా, విషజ్వరాల బారినపడిన వారే అధికంగా ఉన్నారు. వీరితో పాటు పాముకాటు, రోడ్డు ప్రమాదాలకు గురై, గాయపడిన వారు కూడా ఉన్నారు. వీరందరికీ వైద్యుడు నాగేశ్వరరావు చికిత్స అందిస్తున్నారు. వర్షాకాలం కావడంతో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు పాటించి, జ్వరాలు రాకుండా చూసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది సూచిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు.

మీనామృతంతో పంటలకు మేలు


మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న లక్ష్మి

బొబ్బిలి: చేపల వ్యర్థాలు, పచ్చిరొట్ట మొక్కలతో కలిపి తయారు చేసిన మీనామృతంతో పంటలకు మేలు కలుగుతుందని ఎన్‌పీఎం ఎస్‌డీపీ వాంగ్రాసి లక్ష్మి అన్నారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో మీనామృతం తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మీనామృతాన్ని ఎరువుగా వాడుకోవడం ద్వారా పంట ఆరోగ్యంగా ఉంటుందని, తద్వారా దిగుబడి కూడా అధికంగా వస్తుందని తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: స్థానిక పట్టణంలో వాసవి కళింగ వైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షులుగా గెంబలి హరిరామ శంకరరావు, గెంబలి శ్రీనివాసరావు ఎంపిక కాగా, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస గుప్తా, కార్యదర్శిగా వారణాసి రామగణేష్, సంయుక్త కార్యదర్శిగా కెంగువ శ్రీనివాసరావు, కోశాధికారిగా గుడ్ల సూర్యనారాయణ గుప్తా, గౌరవాధ్యక్షులుగా సుంకరి సాయిరమేష్, భోగి రత్న మాణిక్యాలరావు, తంగుడు గురునాధరావు ఎన్నికయ్యారు.

ఉచితంగా హోమియో మందు పంపిణీ


హోమియో మందులు అందజేస్తున్న వైద్యులు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని జగద్గురు పీఠం ఆధ్వర్యంలో కళ్లకలకల రోగులకు ఉచితంగా హోమియో మందు ఆదివారం పంపిణీ చేశారు. హోమియో వైద్యులు శంబంగి సుధాస్రవంతి పర్యవేక్షణలో రోగులకు అవసరమైన మందులు, సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కృష్ణదాసు మాస్టారు, శ్రీనివాసరావు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పరిశీలన


అంతకాపల్లిలో చేస్తున్న ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ రాజు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో జరుగుతున్న ఓటర్ల సర్వేను తహసీల్దార్ ఎస్.కె.రాజు ఆదివారం పరిశీలించారు. అనంతరం సర్వే జరుగుతున్న తీరును బీఎల్‌ఓ గెడ్డాపు అనంతరావును అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల జాబితాలోని వివరాలు సరిచూసి, మార్పులు, చేర్పులు ఏవైనా ఉంటే చేయాలని సూచించారు. పక్కాగా ఓటర్ల జాబితా తయారు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వాకముల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి కనబరచాలి


విద్యార్థులతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనంపై ఆసక్తి కనబరచాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ విద్యార్థులతో వివిధ రకాల పుస్తకాలను చదివించడంతో పాటు బొమ్మలు వేయించడం, కథలు చెప్పించడం, రాయించడం చేయించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాల్లో ప్రతీ ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, ఈ కార్యక్రమాన్ని విద్యార్థులంతా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. విద్యార్థులంతా చదువుతో పాటు, క్రీడలు, చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలపై కూడా దృష్టి సారించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వంగర: మండలంలోని మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గొర్లె సూర్యకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూపులో చేరేందుకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న వారంతా గురుకులానికి వచ్చి, దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8328027417ను సంప్రదించాలని కోరారు.

వలంటీర్‌కు ఆర్థికసాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వలంటీర్‌ను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని పదో వార్డుకు చెందిన వలంటీర్ జి.నాగరాజు అనారోగ్యంతో విజయనగరం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు ఆదివారం ఆస్పత్రికి వెళ్లి, వలంటీర్‌ను పరామర్శించారు. అనంతరం అతడికి రూ.10 వేలను ఆర్థికసాయంగా అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

వరినాట్లు వేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి


ఉప్పర్నాయుడువలసలో వరినాట్లు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: రైతులు ఖరీఫ్‌లో వరినాట్లు వేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ సూచించారు. ఆదివారం మండలంలోని లక్ష్మీపురం, ఆడవరం, ఉప్పర్నాయుడువలస, అక్కన్నఅగ్రహారం తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉభాలు(వరినాట్లు వేయడం) వేయడాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నారు తీసిన తర్వాత చిగుర్లను తొలగించి, నాట్లు వేసుకోవాలని రైతులకు సూచించారు. నారు చివరి భాగాన క్రిమి సంహారక పురుగులు గుడ్లను పెట్టి, లార్వాగా మారి పంటను పాడుచేస్తాయని తెలిపారు. గుడ్డు దశలోనే చిగుళ్లను చించివేస్తే పంటలు చీడపీడల బారిన పడకుండా ఉంటాయన్నారు.